క్లుప్తంగా

ఆత్మీయ పలకరింపు



పలమనేరు: పూతలపట్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆయన వారికి సూచించారు.

పీహెచ్‌సీ, సచివాలయం తనిఖీ

రొంపిచెర్ల: గర్భవతులు, బాలింతలు, పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య కార్యక్రమాల మేనేజర్ డాక్టర్ హర్షవర్థన్ అన్నారు. బుధవారం రొంపిచెర్ల పీహెచ్‌సీ, బొమ్మయ్యగారిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలు, పిల్లలు ఎలాంటి చికిత్స పొందారు? వారికి సకాలంలో టీకాలు వేశారా, లేదా? అని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గణాంకణాధికారి జార్జ్, జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి గుణశేఖర్, జిల్లా ప్రోగ్రాం అధికారి రాంమోహన్ , డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, వినయ్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

రోబోటెక్ శస్త్రచికిత్సలపై వర్క్ షాప్

గుడుపల్లె: పీఈఎస్ ఆసుపత్రిలో రోబోటిక్ శస్త్రచికిత్సలపై అవగాహనకు బుధవారం వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శశికిరణ్ జీర్ణాశయాంతర రోబోటిక్ శస్త్ర చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూ పరింటెండెంట్ సుబ్రమణ్యం, చిదంబరరావు, మోహన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రొంపిచెర్ల: మండలంలోని బండ కిందపల్లె గ్రామ పంచాయతీ మట్లోళ్లపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం పశువుల కాపరుల ద్వారా ఇది వెలుగులోకి వచ్చింది. వారి సమాచారంతో గ్రామ సేవకుడు ఇర్ఫాన్ అలీ రొంపిచెర్ల పోలీసులకు, తహసీల్దార్ మోహిద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్‌ఐ తులసీరాం సంఘటన స్థలాన్ని ఇదేరోజు రాత్రి పరిశీలించారు. మృతుడికి దాదాపు 56 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు.శవాన్ని పంచనామా కోసం అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కల్లూరులో అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



అదిగదిగో జగనన్న: సీఎం చూసి భవనాల నుంచి కేరింతలు కొడుతున్న మహిళలు



భరోసా: దిగులు పడొద్దు.. అండగా ఉంటాను భాయ్..

ఉప్పొంగిన అభిమానం

మేమంతా సిద్ధం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర ఆద్యంతమూ పార్టీ శ్రేణుల అభిమానం ఉప్పొంగింది. తమ అభిమాన నాయకుడు రావడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున అభిమానులు రోడ్డుపైకి చేరుకున్నారు. జై జగన్ ..అంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో జగన్ తన కాన్వాయ్‌ని ఆపి ప్రజలకు అభివాదం చేశారు. దారి పొడవునా పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి ఘన స్వాగతం పలికారు. కల్లూరులో అశేష జనవాహిని ఆయనకు ఘన స్వాగతం పలికింది.

– సదుం/పులిచెర్ల(కల్లూరు)



అభిమానంగా పలకరిస్తూ..



కల్లూరులో సీఎం కార్యక్రమంలో అశేష జనం





దిష్టి తీసేందుకు సిద్ధంగా ఉన్న చెల్లెమ్మలు



జగనన్నా...అంటూ నమస్కరిస్తున్న మహిళలు

మిద్దెలెక్కిన అభిమానం: అన్నా..నిను చూసేందుకు వచ్చామన్నా..



ఆత్మీయత పంచుతూ..



ఎగసిన జన కెరటం



మురిపించిన కానుక



పలమనేరు: కల్లాడు సచివాలయ సమీపంలో బస్‌షెల్టర్‌లో పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు



కుప్పం: సచివాలయం వద్ద పడికాపులు కాస్తున్న లబ్ధిదారులు



గుడుపల్లె: యామనూరు వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



బైరెడ్డిపల్లె: పింఛన్లు ఇస్తున్న సచివాలయ సిబ్బంది



చౌడేపల్లె-2 సచివాలయంలో పెన్షన్ల కోసం వచ్చి లబ్ధిదారులు



గంగవరం-1 గ్రామ సచివాలయం వద్ద క్యూలో నిలబడి పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

పెన్షన్.. టెన్షన్..

- 'పండుటాకుల'కు 'చంద్ర' కష్టాలు
- సచివాలయాల వద్ద పింఛనుదారుల పడిగాపులు
- వికలాంగులకు తప్పని ఇక్కట్లు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో పింఛనుదారులకు అష్టకష్టాలు తప్పలేదు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లను దూరం పెట్టడం విదితమే. సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బు తెచ్చి బుధవారం మధ్యాహ్నం తర్వాత పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. అయితే టీడీపీ నాయకులు గ్రామాల్లో తప్పుడు ప్రచారం కారణంగా కొన్ని సచివాలయాలకు లబ్ధిదారుల్లో వికలాంగులు, వృద్ధులు, నడవలేనివారు అవస్థలు పడుతూ ఎలాగో చేరుకున్నారు. మిట్ట మధ్యాహ్నం ఎండకు తట్టుకోలేక బస్‌షెల్టర్లు, చెట్లకింద పడిగాపులు కాశారు. చివరకు నిరాశతో వెనుదిరిగారు. ఎట్టకేలకు సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ మొదలైంది. తొలిరోజు దాదాపు 30 శాతం పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో మొత్తం పింఛనుదారులు 46వేలమంది ఉన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు

పింఛనుదారుల ఇబ్బందులను గమనించిన కొందరు సచివాలయాల సిబ్బంది వారికి నీడ కోసం షామియానాలు వేయించారు. మంచినీటిని అందుబాటులో ఉంచారు. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు పింఛను దారులకు భోజన వసతి కల్పించారు.

చంద్రబాబుపై దుమ్మెత్తిపోస్తున్న పింఛనుదారులు

ఏ సచివాలయం వద్ద పింఛనుదారులను పలకరించినా నిమ్మళంగా ఇంటికాడికి తెచ్చి పింఛను ఇస్తోన్న వలంటీర్లను తీసేశారు.. ఇప్పుడు ఇన్ని కష్టాలకు కారణమైన చంద్రబాబుకు దేవుడు మంచి చేయడు స్వామీ! అంటూ శాపనార్థాలు పెట్టారు. మాలాంటి ముసలోళ్ల ఉసురు తగులుతుందంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

పింఛన్ల కోసం తప్పని తిప్పలు

గంగవరం: పింఛన్ల పంపిణీలో గత టీడీపీ ప్రభుత్వం నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయి. గ్రామ సచివాలయాల వద్ద బుధవారం ప్రారంభమైన పింఛన్ల పంపిణీకి లబ్ధిదారులు క్యూ కట్టారు. టీడీపీ నాయకుల వల్లే తమకీ కష్టాలు వచ్చాయంటూ పలువురు దుమ్మెత్తిపోశారు. మండల వ్యాప్తంగా మొత్తం పింఛనుదారులు 8,440 మందికి దాదాపు రూ.2.60 కోట్లు పింఛన్ల రూపేణా ఇవ్వాల్సి ఉంది. ఇందులో రూ.1.80 కోట్లు బ్యాంకు నుంచి ఉపసంహరణ చేసి అన్ని సచివాలయాలకు పంపామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బ్యాంకులో నగదు లేని కారణంగా గురువారం నగదు డ్రా చేసి పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: పింఛన్ల కోసం ఉదయం 7 గంటలకే మండలంలోని ఆయా సచివాలయాలకు లబ్ధిదారులు వ్యయప్రయాసలకోర్చి వచ్చారు. ఎండకు తాళలేక అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. పింఛనుదారుల ఇక్కట్లను గమనించిన బైరెడ్డిపల్లె సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్‌బాషా వారికి భోజన వసతి కల్పించారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక వి.కోట పంచాయతీ సచివాలయం -1లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించడంతో లబ్ధిదారులు క్యూ కట్టారు. నాలుగేళ్లుగా జగన్ పుణ్యమా అని పింఛన్లు ఇళ్ల వద్దే పొందామని, ఇప్పుడు చంద్రబాబు మూలాన సచివాలయాలకు ఎండల్లో వచ్చి పింఛన్లు తీసుకోవాల్సి వచ్చిందని లబ్ధిదారులు శాపనార్థాలు పెట్టారు.



పలమనేరు: పింఛనుదారులతో కిటకిటలాడిన గంటావూరు సచివాలయం

తెలుగుదేశమోళ్లకు ఏమొచ్చిందో పోగాలం

పుంగనూరు: వలంటీర్లు తెల్లారగానే ఇంటికాడికొచ్చి, నిద్రలేపి, పెన్షన్ దుడ్డు ఇస్తావుండ్రి...బిడ్డ లెక్క వచ్చి వాళ్లిస్తాంటే తెలుగుదేశమోళ్లకు ఏమొచ్చిందో పోగాలం...వలంటీర్లకు అడ్డమేసిండారంటా ...మా ఉసురు ఊరికే పోదు.. ఈ వయసులో మాకు ఈ కష్టాలు పెడతావుండారు. జగనన్న వస్తేనే ఇంటికాడ పెన్షన్ ఇస్తారంటా..అని పలుచోట్ల పింఛనుదారులు గోడు వెళ్లబోసుకోవడం కనిపించింది. బుధవారం మండలంలోని భీమగానిపల్లె, మంగళంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి పెన్షన్లు పంపిణీ చేశారు. అలాగే చౌడేపల్లె మండల కేంద్రంలోని 2వ సచివాలయంలో పెన్షన్లకు వృద్ధులు, వికలాంగులు, వేచి ఉండాల్సి వచ్చింది. ఉద్యోగులకు ముఖచిత్రాలు తీసుకోవడంలో అనుభవం లేకపోవడం, వలంటీర్లు లేకపోవడంతో ఆ సచివాలయ పరిధిలోని వందలాది పెన్షన్ దారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

చూపు లేని బిడ్డలతో పింఛను పాట్లు

మండలంలోని మఠం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, కృష్ణమ్మ దంపతులు పొలంలో ఇళ్లు కట్టుకుని అక్కడే ఉంటున్నారు. వీరికి ఓ కుమార్తె. ఒక కొడుకు. అమ్మాయి అంకిత(21), కొడుకు బాబు(19). పిల్లలిద్దరికీ పుట్టుకతోనే కంటి చూపు లేకుండా పోయింది. దంతపలు వ్యవసాయం చేస్తూ, తీరిక సమయాల్లో కూలీ పనులకు వెళ్లేవాళ్లు. స్థానిక వలంటీరు లావణ్య ప్రతి నెలా ఒకటిన వీరి ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము లబ్ధిదారులకు అందించేది. కానీ ఈ నెలలో వలంటీరు పింఛను ఇచ్చే అవకాశం లేకపోవడంతో బుధవారం తన పనులు మానుకుని కృష్ణమ్మ ఇద్దరు బిడ్డలను తీసుకుని మఠం గ్రామ సచివాలయం వద్దకు వచ్చి వారి పెన్షన్లు తీసుకుంది. సరైన దారి కూడా లేక పొలం గట్లపై బిడ్డలను తీసుకుని రావాల్సి వచ్చిందని వాపోయింది. తమ లాంటి వారిని ఇబ్బంది పెట్టకుండా వలంటీరుతోనే పింఛను ఇప్పించాలని అధికారులను కోరింది.

– శాంతిపురం



కంటిచూపులేని పిల్లలతో కృష్ణమ్మ

కుప్పంలో..

కుప్పం: బుధవారం ఉదయమే పింఛనుదారులు సచివాలయానికి వచ్చినా సాంకేతిక సమస్యల కారణంగా సాయంత్రం వరకూ పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. తమకీ కష్టాలు రావడానికి చంద్రబాబే కారణమని తిట్టిపోశారు. కుప్పం-2 సచివాలయం, పంచాయతీరాజ్ కార్యాలయం, గుడుపల్లె మండలం యామనూరు సచివాలయం వద్ద గంటల తరబడీ పడిగాపులు కాసి వెనుదిరిగారు.

పెన్షన్ కోసం ఎదురు చూపులే..

శాంతిపురం: మండలంలోని కెనమాకులపల్లె గ్రామ సచివాలయానికి ఉదయం 9 గంటలకంతా వచ్చిన లబ్ధిదారులు సాయంత్రం 6 వరకూ నిరీక్షించినా ప్రయోజనం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 8,321 మందికి రూ 2.48 కోట్ల పింఛను మొత్తం ఇవ్వాల్సి ఉంది. తొలి రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత మఠం, సి.బండపల్లె సచివాలయాల పరిధిలో మాత్రమే పింఛన్లు ఇచ్చారు. రాత్రి 7 గంటల వరకూ 454 మంది లబ్ధిదారులకు రూ 13.62 లక్షలు మాత్రమే పంపిణీ అయ్యింది. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందని, మిగతా సచివాలయాల్లో గురువారం నుంచి పింఛన్లు అందజేస్తామని అధికారులు తెలిపారు.

రామకుప్పంలో..

రామకుప్పం: పింఛన్ల కోసం రామకుప్పం సచివాలయంలో లబ్ధిదారులు పడికాపులు కాశారు. తహసీల్దార్ శ్రీధర్ ఫించనుదారులు అవస్థలు పడ్డారు. వలంటీర్లతో పింఛన్లు ఇచ్చేటప్పుడే బాగుందని, ఇప్పుడు అగచాట్లు పడాల్సి వస్తోందని వాపోయారు. తహసీల్దార్ శ్రీధర్, సిబ్బంది పింఛన్లను పంపిణీ చేశారు.



బైరెడ్డిపల్లె: సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు

రాత్రివేళ పింఛను పాట్లు


చౌడేపల్లె: టీడీపీ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు చేసిన ఫిర్యాదు మూలాన పెన్షన్ల పంపిణీ సేవలకు వలంటీర్లను దూరం పెట్టడం లబ్ధిదారులకు శాపంగా మారింది. బుధవారం పింఛన్ల కోసం సచివాలయాలకు వృద్ధులు తమ కుటుంబ సభ్యుల సాయంతో వచ్చి పడిగాపులు కాశారు.

కొన్ని చోట్ల రాత్రి అయినా పింఛన్ల పంపిణీ చేస్తూనే ఉన్నారు. రాత్రి 8గంటల ప్రాంతంలో కొండామారి సచివాలయం వద్ద పెన్షన్ పొందడానికి చిప్పిలివారిపల్లెకు చెందిన చిన్నక్క, రెడ్డెమ్మ తమ కుమారుడితో కలసి బైక్‌పై కార్యాలయానికి వచ్చి పెన్షన్ తీసుకెళ్లారు. ఎప్పటిలాగే ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలని అధికారులను కోరారు.



పెన్షన్ కోసం కొండామారి సచివాలయం వద్దకు రాత్రి పూట బైక్ వచ్చిన వృద్ధులు

చంద్రబాబూ ఎందుకీ కక్ష?



మాపై చంద్రబాబుకు ఎందుకో ఈ కక్ష? ఇట్లా ఎండలో వచ్చి పింఛను కోసం పడుతున్న ఇబ్బందులు చూస్తే ఆయన మా బాధలు తెలుస్తాయి. ఇక్కడికి ఎందరినో బతిమాలాడి వచ్చా. తీరా డబ్బుల కోసం బ్యాంకుకు పోయినారు.. సాయంత్రానికి ఇస్తామంటే ఈ బస్‌షెల్టర్‌లో కూర్చుని ఉన్నాం. పొద్దున వచ్చాం.. ఇప్పటికీ భోజనం కూడా లేదు. ఈ చంద్రబాబుకు మాలాంటివాళ్ల గోడు తగలకపోదు.

– రామ్మూర్తి, మారుమూరు, పలమనేరు మండలం


వలంటీర్లను పంపకే ఈ అవస్థలు



ఒకటో తేదీ వచ్చిందంటే వలంటీర్లు పొద్దున్నే వచ్చి, నిద్రలేపి పింఛను డబ్బులు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు వాళ్లను ఇవ్వనీకుండా చేశారు. పింఛన్ ఇస్తారని పొద్దున్న 9 గంటలకు కెనమాకులపల్లెకు వచ్చా. మధ్యాహ్నం భోజనం కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న నాకు, ఇంకా మరి కొందరికి సచివాలయంలో ఉన్న మేడం భోజనం తెచ్చి పెట్టారు. లేకపోతే ఆకలి బాధతో ఇబ్బంది పడేవాళ్లం. కానీ పొద్దు పోయినా పింఛను డబ్బు మాత్రం చేతికి రాలేదు.

– ధనమ్మ, శాంతిపురం

ఆ దేవుడే చూసుకుంటాడులే..



చంద్రబాబుకు మా లాంటి ముసలోళ్లు ఏమైనా అన్యాయం చేశామా? పింఛను కోసం మేము ఎన్ని బాధలు పడి వచ్చినామో ఆ దేవుడికే తెలుసు. మాలాంటోళ్ల ఉసురు ఊరికేపోదు. ఇన్నాళ్లు ఇంటికాడ సౌకర్యంగా పింఛను తీసుకుంటా ఉంటిమి. ఈ నెలలోనే ఈ కష్టాలన్నీ వొచ్చినాయి. దీనికి కారణమైన వారిని ఆ పైవాడే శిక్షిస్తాడు.

– మునెప్ప, పలమనేరు